క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శోభన్ కుమార్

పెదపూడి: వచ్చే నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజున ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శోభన్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయం కార్యదర్శులు, వీఆర్వోలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శోభన్‌కుమార్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, తహసీల్దార్ రామ్‌కుమార్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, అచ్చిరాజు, బి.ప్రసన్నకుమార్, ఎస్వీ స్వామి, వీఆర్వోలు చండి, రమేష్, ఎల్.కుమార్ తదితరులు పాల్గొన్నారు. **రామేశ్వరం,** ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లోనూ ప్రజలు, వివిధ పార్టీల శ్రేణులకు తహసీల్దార్ రామ్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు కొటికలపూడి చినబాబు, అడబాల అనురాధ, వుండ్రు చంద్రకళలతో కలిసి ఎస్ఐ శోభన్ కుమార్ అవగాహన సమావేశం నిర్వహించారు.

పుస్తక పఠనంతో ఎంతో మేలు



కొంకుదురు గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరానికి హాజరైన విద్యార్థులు

బిక్కవోలు: విద్యార్థుల భావి జీవితానికి పుస్తక పఠనం ఎంతో మేలు చేస్తుందని కొంకుదురు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.బాల అన్నారు. మండలంలోని కొంకుదురు శాఖ గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణా తరగతుల్లో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు, జనరల్ నాలెడ్జ్ అంశాలపై శిక్షణ నివ్వడంతో పాటు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా మానవతా విలువలు అలవడతాయని బాల సూచించారు.

ప్రమాదకరంగా వంతెన



రాఘవపురం సమీపంలోని కొండకురుదు కాలువపై వంతెన దుస్థితి

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురం సమీపంలో కొండకురుదు కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి కోటికేశవరం, సీతానగరం వెళ్లే దారిలో ఈ వంతెన ఉంది. దీనికి రెండు వైపులా ఇరువైపులా రక్షణ గోడలు లేవు. చాలాకాలం క్రితం నిర్మించిన స్తంభాలు శిథిలమయ్యాయి. వాహన చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వంతెనకు రక్షణ గోడలు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అన్నవరంలో మంత్రి వేణు పూజలు



సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న మంత్రి వేణు దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: అన్నవరంలోని సత్యనారాయణస్వామిని సోమవారం రాష్ట్ర బీసీ, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించి, పండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ప్రకాశం నగర్: గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం దానవాయిపేటలోని రాజమహేంద్రవరం మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు విశ్రాంత తెలుగు పండిట్ ముంగండి సూర్యనారాయణ నీతి కథలు, తెలుగు పద్యాలు, పాటలు, సూర్య నమస్కారాలు, పొడుపు కథలను చెప్పారు. విద్యార్థులతో కథలు చదివించారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

మధుర ఫలం.. చేదు నిజం

- కార్బయిట్ మగ్గిస్తున్న పండ్లతో ప్రమాదం
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు



బిక్కవోలు/మధురపూడి: మామిడి, అరటి, సపోటా, దానిమ్మ, ద్రాక్ష.. ఫలమేదైనా అవి తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతుంటారు. కాని సహజ సిద్ధంగా పండిన ఫలాల్లో మాత్రమే పోషకాలు ఉంటాయి. కృతిమ పద్ధతుల్లో రసాయనాలు ఉపయోగించి మగ్గబెట్టిన పండ్లను తింటే అనారోగ్యానికి గురి కాక తప్పదు. అయితే వ్యాపారుల లాభాపేక్ష కారణంగా కార్బయిడ్ మగ్గబెట్టిన పండ్లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వేసవి నేపథ్యంలో ప్రస్తుతం ప్రధానంగా అందరూ నిగనిగలాడుతూ కనిపిస్తున్న మామిడి పండ్లపై మనసు పారేసుకుంటున్నారు. ప్రజారోగ్యం గురించి కనీసం పట్టించుకోని అధికారులు షరా మామూలుగా చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. మధుర ఫలాల వెనుక దాగి ఉన్న చేదు నిజాన్ని గుర్తించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

బహిరంగ మార్కెట్‌లో విచ్చలవిడిగా..

పండ్లపై కార్బయిడ్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినా, కోర్టులు ఆదేశించినా క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేసేవారే లేరు. దీంతో వ్యాపారులు పక్వానికి రాక ముందే పచ్చికాయలను కోసేసి వాటికి రసాయనాలు వినియోగించి పండ్లుగా మారుస్తున్నారు. కార్బైడ్ వేసి మగ్గ పెట్టడం, పొగపెట్టి మగ్గ పెట్టడం, ఇథనాల్ వంటి రసాయనాల్లో ముంచి పచ్చికాయలను పండ్లుగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వేసవి సీజన్‌లో ఎక్కువగా మామిడి కాయలు దిగుమతి అవుతుండటంతో వాటిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు తోటల్లోనే కార్బైడ్, ఇథనాల్ వంటి రసాయనాలతో మగ్గబెట్టి మార్కెట్‌కు తరలించేస్తున్నారు. ఇది తెలియని అమాయక ప్రజలు వాటిని కొనుగోలు చేసి తిని అనారోగ్యానికి గురవుతున్నారు.

మామిడి పండ్ల ధరహాసం

ఈ ఏడాది మామిడి పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పరక ధర రూ.300 నుంచి రూ.500 పలుకుతుండడంతో ప్రజలు వాటిని కొనాలంటేనే భయపడిపోతున్నారు. దివాన్‌చెరువులో పండ్ల మార్కెట్‌లోనైతే 5 కేజీల పండ్లు(సుమారు 15) రూ.450 చెబుతున్నారు. పోనీ ధర ఎక్కువైనా కొందామంటే అవి సహజంగా పండినవో, రసాయనాలతో మగ్గించినవో అర్థం కాక కొనుగోలుదారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ సంవత్సరం దిగుబడి తగ్గిపోవడం కూడా ధర పెరగడానికి కారణంగా కనిపిస్తుంది.

రసాయనాలతో ఆరోగ్యానికి ప్రమాదం



పండ్లు త్వరగా పక్వానికి రావడానికి రకరకాల రసాయనాలు వినియోగిస్తుంటారు. అలా రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి ప్రమాదం. వాటివల్ల జీర్ణ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు ఆరోగ్య సమస్యలు వస్తాయి. సహజసిద్ధంగా పండిన పండ్లనే తినాలి.

– డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, కొంకుదురు

నెలాఖరులోగా నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

రంగంపేట: మన బడి నాడు–నేడు పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు సూచించారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మన బడి–నాడు నేడు పనుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఏ పనులు ఎంత వరకూ పూర్తి చేశారు?ఇంకా చేయాల్సిన పనులేంటి? వాటికి అవసరమైన నిధుల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు, ఆయా పనుల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బిల్లులు, ఫొటోలు అప్‌లోడ్ చేయడంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిషోర్ సూచించారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి–2 పి.మధుసూదనరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలతో రైతులకు మేలు

- ఇదే అనువైన సమయం
- అధికంగా ఎరువుల వాడకంతో అనర్థం

రాజానగరం: పొలాల్లో ఇష్టానుసారంగా పంటలను సాగు చేయడం వలన భూసారం తగ్గిపోయే అవకాశం ఉంది. ఈ కారణంగా ప్రతి రైతు తమ భూముల్లో మట్టి నమూనాలు తీసి, భూసార పరీక్ష చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఏ పంటలకు ఏ మోతాదులో ఎరువులు వాడొచ్చు, ఏ సమయాల్లో ఏ విధమైన సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చు అనే విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. 2014–15 నుంచి జిల్లాలో పలు గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేస్తున్నారు. వాటి ఆధారంగా రైతులకు కార్డులు అందజేశారు. భూసార పరీక్ష ద్వారా వచ్చిన రిపోర్టును అనుసరించి ఆయా భూములలో పండించే పంటలు, వాడాల్సిన ఎరువుల గురించి తెలియజేశారు. అప్పటి నుంచి చాలా మంది రైతులు వాటిని అనుసరిస్తున్నారు.

మోతాదు మించితే అనర్థం

సాధారణంగా చాలామంది రైతులు తమ పొలాలలో అధిక దిగుబడులు సాధించాలనే కోరికతో ఇష్టానుసారంగా రసాయన ఎరువులను వాడుతున్నారు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా చీడపీడలు కూడా పెరిగి పంట దిగుబడులు తగ్గేందుకు అవకాశాలున్నాయి. అందుకనే పోషకాల సమతుల్యతను పాటించడానికి, రసాయనిక ఎరువులు సరైన మోతాదులో వాడటానికి భూసార పరీక్షల ఆవశ్యకత ఎంతగానో ఉందంటున్నారు. ప్రతి రైతు తమ పొలంలో ఏదో ఒకటి పండించేస్తున్నామనుకోకుండా భూసార పరీక్షలు చేయించాలి. వాటి ఫలితాల ఆధారంగా పంటలు పండించాలి.



కాపవరంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

జాగ్రత్తలు తీసుకోండి

వ్యవసాయం చేసే ప్రతి రైతు సాగు చేసే పొలాలలో సూక్ష్మ పోషకాలు లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సూక్ష్మ పోషకాలుగా పిలువబడే జింకు, బోరాన్, జిప్సమ్ (కాల్షియం, గంధకం) పంటలలో లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుని దిగుబడులను పెంచుకోవచ్చు. ఖరీఫ్ సాగుకు ముందుగానే ప్రతి రైతు తమ పొలాలలో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవడం మంచిది. ఇందుకుగాను 50 శాతం రాయితీపై సూక్ష్మపోషకాలను వ్యవసాయశాఖ ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తుంది.

భూసార పరీక్షలు చేస్తున్నాం

ప్రస్తుతం ఎక్కడైనా రైతులు కోరితేనే మట్టి నమూనాలు తీసుకుంటున్నాం. ఎవరికైనా వీటిపై ఆసక్తి ఉంటే దగ్గరలోని రైతుభరోసా కేంద్రాన్ని సంప్రదించాలి. ఆపై మట్టి నమూనాలు తీసుకుని, భూసార పరీక్షలు చేయివచ్చు. భూసారం బాగుంటేనే దిగుబడులు బాగుంటాయనే విషయాన్ని రైతులు గ్రహించాలి. వేసవిలో పచ్చిరొట్ట వంటి భూసారాన్ని పెంచే వాటిని సాగుచేసుకొని, వేసవి దుక్కులు చేయడం మంచిది.

– పల్లా సురేష్, వ్యవసాయాధికారి, సీతానగరం

ఎమ్మెల్యే దంపతుల పరామర్శ

పెదపూడి: పెదపూడి మండలాభివృద్ధికి మాజీ ఎంపీపీ యార్లగడ్డ లక్ష్మీకాంతం చేసిన కృషి మరవలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 24న మృతి చెందిన మాజీ ఎంపీపీ యార్లగడ్డ లక్ష్మీకాంతం కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం పరామర్శించారు. లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, మాజీ సర్పంచ్ మార్ని రుద్ర ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ అమ్మన్న చౌదరి, పప్పు సింహాచలం, కాకర సాయిబాబు, సాంబత్తుల చంటి, అందుగుల అబ్బు, దొండపాటి దావీదు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీపీ లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఎండుగడ్డికి పెరిగిన డిమాండ్



పశువుల కోసం భద్రపరిచిన ఎండుగడ్డి

మధురపూడి: ఎండుగడ్డికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ట్రాక్టర్ గడ్డికి రూ.7 వేల నుంచి రూ.12 వేల వరకూ చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రబీ కోతలు దాదాపు ముగిశాయి. చాలామంది రైతులు మెషీన్లతో వరి పంటను కోయించారు. తక్కువ మంది రైతులు మాత్రమే కూలీలతో కోతలు చేయించారు. కూలీలు కోసిన పంటను మాసూలు చేసిన తర్వాత వచ్చే గడ్డికి డిమాండ్ పెరిగింది. దీనిని పశువులు బాగా తింటాయని రైతులు చెబుతున్నారు. మెషీన్లతో కోసిన గడ్డి ముక్కలుగా తెగిపోతుందని, దానిని పశువులకు దాణాగా వేయడం కుదరదని చెబుతున్నారు. కోరుకొండ మండలంలోని రైతులు కొద్ది మంది మాత్రమే కూలీలతో కోతలు కోయించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎండుగడ్డిని పాడి రైతులు కొనుగోలు చేస్తున్నారు. మెషీన్లతో కోయించడం వల్ల పంట చాలా తొందరగా ఒబ్బిడవుతుంది. కూలీలతో కోతలు చేయిస్తే ఆలస్యం కావడంతో పాటు డబ్బులు ఎక్కువ ఖర్చవుతాయి. దీంతో రైతులందరూ యంత్రాల కోతకే ఆసక్తి చూపుతున్నారు. అయితే.. యంత్రాల ద్వారా వరి పంటను కోయించగా వచ్చిన గడ్డిని కూడా పశువులకు దాణాగా వేయవచ్చని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. దానిలో అన్ని పోషకాలు ఉంటాయని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కోనసీమ ప్రాంతంలో కొందరు రైతులు తమ పశువులకు ఆ గడ్డినే దాణాగా పెడుతున్నారు. దానిని పశువులు ఇష్టంగా తింటున్నాయని, పాల దిగుబడిలో ఎలాంటి తేడా లేదని చెబుతున్నారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు



బూరుగుపూడిలోని ఎన్‌కే ఇండస్ట్రీస్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మధురపూడి: ప్రభుత్వ అనుమతులు లేకుండా కూల్ డ్రింక్స్, సోడా పరిశ్రమలను నిర్వహిస్తే సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ఎన్‌కే ఇండస్ట్రీస్ (సోడా, సాఫ్ట్‌డ్రింక్స్ యూనిట్)ను విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ శాఖల అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రీస్‌లో పెట్ బాటిళ్లపై బ్యాచ్ నంబర్లు లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాలుగు లెమన్ బాటిళ్ల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారన్నారు. ధ్రువీకరించని తూకం యంత్రాన్ని ఉపయోగిస్తున్నందున లీగల్ మెట్రాలజీ అధికారులు మరో కేసు నమోదు చేశామన్నారు. అనధికారిక కూల్ డ్రింక్స్, సోడా పరిశ్రమలపై నిఘా కొనసాగుతోందన్నారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, నవీన్, వలీ, కిషోర్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న స్కూటీ

గండేపల్లి: లారీని స్కూటీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డు సేఫ్టీ సిబ్బంది కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ గండేపల్లి వచ్చేసరికి వెనుక వస్తున్న స్కూటీ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి, ఒక మహిళకు గాయాలుకాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గణిత పరీక్షకు 22 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో సోమవారం జరిగిన గణిత పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఉదయం జరిగిన గణితం పేపర్–1 పరీక్షకు మొత్తం 238 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 220 మంది, మధ్యాహ్నం జరిగిన గణితం పేపర్–2 పరీక్షకు 68 మంది హాజరు కావాల్సి ఉండగా 64 మంది హాజరయ్యారన్నారు.

2న కౌంటింగ్ ట్రయల్ రన్

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న విషయం తెలిసిందే. దీనిని సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడంలో భాగంగా జూన్ 2న ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ పి.జగదీష్, వివిధ అనుబంధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎం యూనిట్లను తరలించడం, కౌంటింగ్ పూర్తయిన తరువాత తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు వంటి వాస్తవ పరిస్థితిని గమనించి, ఏవైనా లోటుపాట్లు ఉంటే అధిగమించడం కోసం ఈ ట్రయల్ రన్ ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, ఆర్డీఓ చైత్రవర్షిణి, డీపీఓ డి.రాంబాబు పాల్గొన్నారు.



ట్రయల్ రన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయి, నిందితుడితో ఎస్సై అంకారావు, డిప్యూటీ తహసీల్దార్ రమ్య

రాజమహేంద్రవరం రూరల్: ట్రావెల్ బ్యాగ్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని సోమవారం మధ్యాహ్నం మోరంపూడి సెంటర్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 10.730 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన అజ్మాయ్ పాషా విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గుర్తు తెలియని రైతు వద్ద గంజాయిని కొనుగోలు చేశాడు. దానిని ట్రావెల్ బ్యాగులో దాచి బెంగళూర్ వెళుతున్నాడు. ప్రయాణంలో అతడు లారీలు ఎక్కుతూ దిగుతూ వెళుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అజ్మాయ్ పాషా మోరంపూడి సెంటర్‌లో దిగి నడుచుకుంటూ ముందుకు వెళ్తున్నాడు. ఈలోపు పోలీసులకు అందిన సమాచారం మేరకు మహాలక్ష్మి మార్కెట్‌కు వచ్చేసరికి అతడిని బొమ్మూరు ఎస్సై అంకారావు, సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. రూరల్ డిప్యూటీ తహసీల్దార్ రమ్య సమక్షంలో తనిఖీ చేశారు. ట్రావెల్ బ్యాగ్‌లోని 10.730 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, పాషాను అరెస్టు చేశారు. గంజాయి విలువ రూ.64,380 ఉంటుందని ఎస్సై అంకారావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పుట్టపర్తి యాత్రను విజయవంతం చేయాలి

రంగంపేట: ఈ ఏడాది ఆగస్టు 3, 4 తేదీల్లో నిర్వహించనున్న తూర్పుగోదావరి జిల్లా నుంచి పుట్టపర్తి వెళ్లే యాత్రను భక్తులంతా విజయవంతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని కోటపాడు, ఈలకొలను, ముకుందవరం గ్రామాల్లోని సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ల ఆధ్వర్యంలో సోమవారం రంగంపేట సత్యసాయి మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేద పఠనం, భజన, తదితర సాంస్కృతిక కార్యక్రమాల్లో అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. యాత్రకు వచ్చే భక్తుల అవసరాలను బట్టి అదనపు రైలు బోగీలు ఏర్పాటు చేయించడానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎస్వీ సాయిరామ్, మహిళా విభాగ సేవాదళ్ సమన్వయకర్త బి.రామలక్ష్మి, విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, సాయి సుధాకర్, త్రిమూర్తులు, విజయసాయి, మలిరెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

- కౌంటింగ్ రోజు ప్రశాంతంగా ఉండాలి
- డీఎస్పీ అంబికా ప్రసాద్
- కడియంలో పోలీసుల మాక్ డ్రిల్



కడియంలో మాక్ డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ అంబికాప్రసాద్ తదితరులు

కడియం: దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ నేతృత్వంలో స్థానిక పోలీసులు, ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కడియం హైస్కూల్ రోడ్డులో మాక్ డ్రిల్ నిర్వహించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పోలీసులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారనే విషయాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. ముందుగా ఆందోళనకారులు నినాదాలు చేయడం, వారిని పోలీసులు వారించడం, పరిస్థితి అదుపు తప్పడంతో లాఠీచార్జి, అనంతరం పోలీసుల కాల్పులు, గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి, ఆసుపత్రికి తరలించడాన్ని ప్రదర్శించారు. అనంతరం డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును సక్రమంగా నిర్వహించడమే పోలీసుల ముందున్న లక్ష్యమన్నారు. కౌంటింగ్ రోజు ప్రజలు క్రమశిక్షణతో పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలలో ఉన్న భయాన్ని తొలగించేందుకు నిరంతరం వారితో ఉంటూ మాక్ డ్రిల్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరగాలని, శాంతి భద్రతలకు ఎవరు ఆటంకం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. లెక్కింపు రోజున ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి తాము సిద్ధంగా ఉన్నారన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రౌడీ షీటర్లు, అనుమానితులను బైండోవర్ / హౌస్ అరెస్ట్ చేస్తామని, అలాగే ఓట్లు లెక్కింపు ముగిసిన అనంతరం ఎటువంటి అల్లర్లకు తావులేకుండా కార్యకర్తలను అదుపులో ఉంచుకునే బాధ్యత రాజకీయ పార్టీల నాయకులదేనన్నారు. ఎస్పీ జగదీష్, కలెక్టర్ మాధవీలత ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్సైలు టి.కృష్ణసాయి, దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో భాగంగా గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందిస్తున్న పోలీసులు